సాక్షి నంద్యాల

గురువారం । 9 । మే । 2024




సాక్షిగణపతికి పూజలు

ఆత్మకూరు: శ్రీశైల మహాక్షేత్రంలో లోక కల్యాణార్థం బుధవారం సాయంత్రం సాక్షిగణపతి స్వామికి అభిషేకం. ఆలయ ప్రాంగణంలోని జ్వాలా వీరభద్ర స్వామికి విశేషపూజలు నిర్వహించారు.

అన్నదాన పథకానికి విరాళం



ఆత్మకూరు: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న నిత్య అన్నదాన పథకానికి బుధవారం సూర్యాపేటకి చెందిన నాగిరెడ్డి రూ.1,00,116 విరాళాన్ని ఆలయ పర్యవేక్షకులు మధుసూదన్ రెడ్డికి అందజేశారు. దాతకు జ్ఞాపికను అందజేసి సత్కరించారు.



సామాజిక రాయ'బేరాలు'

వైఎస్సార్‌సీపీకి ముస్లింలు ప్రధాన ఓటు బ్యాంకుగా ఉండటంతో ఓ బీజేపీ నేత కుట్రలు పన్నుతున్నారు. కొంతమంది ముస్లిం పెద్దలతో చర్చలు జరుపుతూ నజరానాలు ప్రకటిస్తున్నారు. 8లో▶

న్యూస్‌రీల్

ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి



టోపీలను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ శ్రీనివాసులు

నంద్యాల: బాధ్యత గల పౌరులుగా 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ సార్వత్రిక ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శ్రీనివాసులు సూచించారు. బుధవారం ఆయన చాంబర్‌లో స్వీప్ యాక్టివిటీ కార్యక్రమంలో భాగంగా ఓటు హక్కు వినియోగంపై టోపీలను ఆవిష్కరించారు. ప్రజాస్వామ్య పద్ధతిలో జరుగుతున్న ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకుని, తమకు నచ్చిన వారికి ఓటు వేయాలన్నారు. 18 ఏళ్లు దాటిన ప్రతి పౌరునికి మన రాజ్యాంగం ఓటుహక్కు కల్పించిందన్నారు. జిల్లాలో ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు వివిధ రూపాల్లో స్వీప్ యాక్టివిటీస్ ద్వారా అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు.

10లోగా తత్కాల్ ఇంటర్ అడ్వాన్స్ ఫీజు చెల్లించండి

నంద్యాల(న్యూటౌన్): ఇంటర్మీడియెట్ మొదటి, రెండో సంవత్సరం అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలకు ఫీజు చెల్లించని విద్యార్థులు తత్కాల్ స్కీమ్ కింద రూ.3వేలు అదనపు ఫీజు చెల్లించి పరీక్షలు రాయవచ్చని నంద్యాల జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాశాఖ అధికారిణి సునీత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తత్కాల్ ఫీజు చెల్లించుటకు ఈనెల 10వ తేదీ వరకు గడువు ఉందన్నారు. ఈ ఫీజు చెల్లించే విద్యార్థులు జిల్లా హెడ్‌క్వార్టర్‌లో పరీక్ష సెంటర్లలో పరీక్షలు రాయాల్సి ఉంటుందన్నారు.

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నంద్యాల(న్యూటౌన్): జిల్లాలోని ప్రభుత్వ ఐటీఐలలో 2024–25 విద్యాసంవత్సరానికి ప్రవేశాలకు తొలి విడత కౌన్సెలింగ్ అర్హత కలిగిన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. iti.ap.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. జూన్ 10వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ విద్యా సంవత్సరంలో ఏడాది కోర్సులు కోపా, డ్రెస్ మేకింగ్, ప్లంబర్, మెకానిక్ డీజిల్, రెండేళ్ల కోర్సులు డీ/మాన్ సివిల్, ఎలక్ట్రీషియన్, ఎలక్ట్రానిక్స్ మెకానిక్, ఫిట్టర్, మిషినిస్ట్ గ్రైండర్, మోకానిక్ మోటారు వెహికల్, రిఫ్రిజరేషన్ ఎయిర్ కండీషన్ టెక్నీషియన్, ఇన్స్ట్రుమెంట్ మెకానిక్, ఐసీటీ ఎస్ఎం ట్రేడ్‌లకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. జూన్ 18వ తేదీ నుండి 26వ తేదీలలో డోన్ ప్రభుత్వ ఐటీఐలో జరిగే కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని ప్రిన్సిపాల్ కోరారు. విద్యార్థులకు కాల్ లెటర్స్ పంపడం జరుగుతుందని వివరించారు. పదవ తరగతి పాస్, ఫెయిల్ అయిన విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు.

గిరిజన విద్యార్థులకు జాతీయ స్కాలర్‌షిప్

కర్నూలు(అర్బన్): 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి గిరిజన విద్యార్థినీ, విద్యార్థుల ఉన్నత విద్యకు జాతీయ ఓవర్సీస్ స్కాలర్‌షిప్ అందిస్తున్నట్లు జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారిణి జే రంగలక్ష్మీదేవి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భారత ప్రభుత్వ గిరిజన మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఈ పథకం ద్వారా స్కాలర్‌షిప్ పొందేందుకు మాస్టర్ లెవెల్ పీహెచ్‌డీ, పోస్టు డాక్టరల్ రీసర్చ్ ప్రోగ్రాంలో ప్రవేశం పొందిన విద్యార్థులు ఈ నెల 31వ తేదిలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

పాలిసెట్ ఫలితాల విడుదల

కర్నూలు సిటీ: పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష ఫలితాలను బుధవారం విడుదల చేశారు. గత నెల 27న జరిగిన పరీక్ష నిర్వహించగా.. ఈ నెల 4న తుది కీ విడుదల చేశారు. ప్రవేశ పరీక్షకు జిల్లా నుంచి బాలురు 4,856, బాలికలు 2,390 మంది.. మొత్తం 7,246 మంది హాజరుకాగా 6,373 మంది ఉత్తీర్ణులయ్యారు. నంద్యాల జిల్లా నుంచి బాలురు 3,607 మంది, బాలికలు 1,873 మంది..మొత్తం 5,480 మంది హాజరుకాగా 4,854 మంది ఉత్తీర్ణులయ్యారు.

ఐదేళ్ల తర్వాత.. అవే ఫలితాలు

వైఎస్సార్‌సీపీ ఆవిర్భావం నుంచి ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఆపార్టీ పైచేయి సాధిస్తోంది. 2012లో ఆళ్లగడ్డ, ఎమ్మిగనూరులో జరిగిన రెండు ఉప ఎన్నికలలో ఖాతా ప్రారంభించి, 2014లో 11 అసెంబ్లీలు, 2 ఎంపీలను ఖాతాలో వేసుకుంది. 2019లో పార్లమెంట్, అసెంబ్లీ స్థానాలను పూర్తిగా క్లీన్‌స్వీప్ చేసి టీడీపీ ఉనికి లేకుండా చేసింది. ఈ దఫా కూడా అవే ఫలితాలు పునరావృతమవుతాయనే భావనలో ఆపార్టీ ఉంది. ఇందుకు కారణం ఆ పార్టీ అధినేతకు 'రాయలసీమ'పై ప్రత్యేక అనుబంధం ఉండటం. ఈ ఐదేళ్లలో చేపట్టిన సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలతో పాటు 'సామాజిక న్యాయాన్ని' చేతల్లో చూపించి సాధారణ వ్యక్తులను చేయిపట్టుకుని చట్టసభలకు పంపడమే. ఇవే జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వాన్ని సామాన్యులతో పాటు అన్ని వర్గాల్లో మరో మెట్టు పెంచాయి.

నేడు కర్నూలుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

- ఎస్టీబీసీ మైదానం సమీపంలో వైఎస్సార్ సర్కిల్‌లో బహిరంగసభ
- గత నెలలో కర్నూలు, నంద్యాలలో బస్సుయాత్ర దిగ్విజయం
- పోలింగ్‌కు నాలుగు రోజుల ముందు మరోసారి జిల్లా పర్యటన
- ఉమ్మడి జిల్లాలో 2 ఎంపీలు, 14 అసెంబ్లీలు క్లీన్‌స్వీప్ చేస్తామంటోన్న ఆ పార్టీ నేతలు



అప్పుడూ.. ఇప్పుడూ.. సామాన్యుల పక్షమే

- 2014లో చేనేత వర్గానికి చెందిన బుట్టారేణుకకు ఎంపీ టిక్కెట్ ఇచ్చి పార్లమెంట్‌కు పంపారు. 2019లో చేనేత వర్గానికి చెందిన సంజీవ్‌కుమార్‌ను ఎంపీగా ఢిల్లీకి పంపారు. జిల్లా చరిత్రలో చేనేతలను చట్టసభలకు పంపిన తొలి నాయకుడు జగన్ మాత్రమే.
- 2014, 2019లో వాల్మీకి వర్గానికి చెందిన గుమ్మనూరు జయరాంను చట్టసభలకు పంపి మంత్రి వర్గంలోకి తీసుకున్నారు. జిల్లా చరిత్రలో వాల్మీకి వర్గానికి చట్టసభల్లో ప్రాతినిధ్యం కల్పించింది జగనే! ఆ తర్వాత మధుసూద్‌నుకు ఎమ్మెల్సీ, బీవై రామయ్యను మేయర్‌గా చేసి జిల్లాలో వాల్మీకుల ఆత్మగౌరవాన్ని పెంచడంతో పాటు చట్టసభలకు పంపిడంతో ఆ వర్గం మొత్తం వైఎస్సార్‌సీపీ వైపు నిలబడింది.
- 2019లో కర్నూలు అసెంబ్లీ నుంచి మైనార్టీ అభ్యర్థి హాఫీజ్‌ను చట్టసభలకు పంపారు. ఆ తర్వాత నంద్యాల నుంచి ఇసాక్‌ను ఎమ్మెల్సీగా చేశారు. 2019లో 14 అసెంబ్లీలలో ఒక్క సీటు కూడా టీడీపీ మైనార్టీలకు ఇవ్వలేదు. ఈ దఫా ఎన్నికల్లో కర్నూలు నుంచి ఇంతియాజ్‌ను బరిలోకి దింపడంతో పాటు హాఫీజ్‌ను రాజ్యసభకు పంపిస్తానని చెప్పారు. జిల్లా చరిత్రలో రాజ్యసభకు వెళ్లబోయే మైనార్టీ నేత కూడా హాఫీజ్ మాత్రమే కానుండటం విశేషం. దీంతో మైనార్టీలు కూడా పూర్తి ఏకపక్షంగా జగన్‌మోహన్‌రెడ్డి వైపు నిలిచారు.
- ఆలూరు నుంచి విరూపాక్షి, కర్నూలు ఎంపీగా బీవై రామయ్య, ఎమ్మిగనూరు అసెంబ్లీ నుంచి బుట్టారేణుక, కర్నూలు నుంచి ఇంతియాజ్ పోటీ చేస్తున్నారు. దీంతో కర్నూలు జిల్లాలో నలుగురు బీసీలకు అవకాశం కల్పించినట్లయింది.
- ఇక 2019 నుంచి ఇచ్చిన నామినేటెడ్ పోస్టుల్లో 50శాతం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు అవకాశం కల్పించారు. జిల్లా, రాష్ట్ర చరిత్రలో ఏ నాయకుడూ ఈ సాహసోపేత నిర్ణయం తీసుకోలేదు. ఏ నాయకుడు, పార్టీకి సాధ్యం కాని విధంగా సామాజిక న్యాయం చేతల్లో చేసి చూపించి చరిత్ర సృష్టించారు. దీంతో ఈ వర్గాలన్నీ కూడా జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంపై మరోసారి విశ్వాసం ఉంచాయి.

సభా స్థలం: కర్నూలు ఎస్టీబీసీ మైదానం సమీపంలోని వైఎస్సార్ సర్కిల్
సమయం: ఉదయం 10.55 గంటలకు

మాటకు కట్టుబడి.. విశ్వసనీయతే పెట్టుబడి!

సాక్షి ప్రతినిధి కర్నూలు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేడు కర్నూలుకు రానున్నారు. కర్నూలు, నంద్యాల జిల్లాల్లో ఇటీవల జరిగిన బస్సుయాత్ర దిగ్విజయం కావడంతో 2019 సార్వత్రిక ఎన్నికల ఫలితాలే పునరావృతమవుతాయనే జోష్ ఆపార్టీ నేతల్లో కనిపిస్తోంది. అందులో భాగంగానే ప్రచారం జోరుగా సాగుతోంది. పోలింగ్‌కు నాలుగు రోజుల మందు మరోసారి తమ అధినేత రానుండటంతో రెట్టించిన ఉత్సాహంతో ఎన్నికలకు సిద్ధమవుతున్నారు. ముఖ్యమంత్రి ఉదయం 10.15గంటలకు విజయవాడ నుంచి గన్నవరం ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అక్కడి నుంచి 10.35 గంటలకు కర్నూలుకు చేరుకుంటారు. 10.55 గంటలకు ఎస్టీబీసీ మైదానం సమీపంలోని వైఎస్సార్ సర్కిల్‌లో జరిగే బహిరంగసభలో పాల్గొంటారు. 11.50కు మీటింగ్ ముగించుకుని కళ్యాణదుర్గం బయలుదేరుతారు.

కర్నూలు అభివృద్ధిలోనూ అండగా..

అధికారంలోకి వచ్చాక కర్నూలు అభివృద్ధిలోనూ ముఖ్యమంత్రి తోడుగా నిలిచారు. రాష్ట్రంలో అత్యంత వెనుకబడిన ఆదోని డివిజన్ అభివృద్ధికి 'ఆడా'(ఆదోని అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ)ని ఏర్పాటు చేశారు. సోలార్ డ్రైయర్స్‌తో మహిళలకు ఉపాధి కల్పించారు. రూ.411.74కోట్లతో 2,709 ఎంఎస్ఎంఈ యూనిట్లు స్థాపించి 17,866 ఉద్యోగాలు కల్పించారు. ఎయిర్‌పోర్టు, గ్రీన్‌కో రెన్యువబుల్ ఎనర్జీప్లాంటు, జయరాజ్ ఇస్పాత్, రామ్‌కో సిమెంట్‌తో పాటు పారిశ్రామికరంగాన్ని అభివృద్ధి చేశారు. సంక్షేమం, గ్రామాభివృద్ధికి తీసుకొచ్చిన సంస్కరణలతో జిల్లా ప్రజల ఆర్థిక శక్తి మారింది. సచివాలయ వ్యవస్థతో ప్రతీ పల్లెలో సగటున 15 సర్కారు ఉద్యోగాలు వచ్చాయి. ఇలా జిల్లాలోని 92శాతం కుటుంబాలకు మేలు చేశారు. ముఖ్యంగా ఈ సంస్కరణలు పేద, సామాన్య కుటుంబాలకు తోడుగా నిలిచాయి. దీంతో ఈ వర్గాలన్నీ వైఎస్సార్‌సీపీ వైపు నిలబడ్డారు. జిల్లాలోని మొత్తం ఓటర్లలో 82శాతం గ్రామీణ ఓటర్లు, 18 శాతం అర్బన్ ఓటర్లు ఉన్నారు. దీంతో మెజార్టీ కుటుంబాలకు మేలు జరిగిందని చెప్పడం, ఈ దఫా మేనిఫెస్టోలో కూడా ఆచరణ సాధ్యమయ్యే హామీలు మాత్రమే ఇవ్వడంతో జగన్ చేసేదే చెబుతాడు, చెప్పింది చేస్తాడు అనే విశ్వసనీయతను ప్రజల్లో సంపాదించారు. దీంతోనే అన్ని వర్గాలు ఈ దఫా కూడా వైఎస్సార్‌సీపీ వైపు ఉన్నాయి. తిరిగి మరోసారి 14 అసెంబ్లీ, 2 పార్లమెంట్ స్థానాల్లో క్లీన్‌స్వీప్ చేస్తామనే ధీమాతో ఆ పార్టీ ఉంది.



రుద్రవరంలో రోడ్‌షో నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

డబ్బు మూటలకంటే నమ్మకమైన నాయకుడి వైపే ప్రజలు

ఈ దఫా ఎన్నికల్లో టీడీపీ డబ్బుమూటలనే నమ్ముకుంది. కర్నూలులో టీజీ భరత్ ఓటుకు రూ.2వేలు, బనగానపల్లెలో బీసీ జనార్దన్‌రెడ్డి రూ.3వేల వరకూ పంచేందుకు సిద్ధమయ్యారు. ఆళ్లగడ్డ, శ్రీశైలం, డోన్, ఆలూరు, మంత్రాలయం, ఆదోని, పత్తికొండ ఇలా ప్రతీ చోట ఓటుకు రూ.వెయ్యి నుంచి 2వేలు పంచేందుకు సిద్ధమయ్యారు. ప్రతీ టీడీపీ అభ్యర్థి సగటున రూ.50కోట్లు ఖర్చు చేసేందుకు సిద్ధమయ్యారు. అయినప్పటికీ ప్రజలు మాత్రం ఐదేళ్లకోసారి ఇచ్చే వెయ్యి, రూ.2వేల కంటే తమను కంటికి రెప్పలా చూసుకునే నాయకుడి వైపు ఉంటామని తేల్చిచెబుతుండటం విశేషం.

ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేద్దాం

కర్నూలు(టౌన్): రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కర్నూలు పర్యటనను వైఎస్సార్‌సీపీ శ్రేణులు కలసికట్టుగా విజయవంతం చేయాలని ఉమ్మడి జిల్లా వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ రామసుబ్బారెడ్డి, కర్నూలు పార్లమెంట్ డిప్యూటీ రీజినల్ కోఆర్డినేటర్ ఎస్వీమోహన్ రెడ్డి, కర్నూలు అసెంబ్లీ అభ్యర్థి ఇంతియాజ్ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక ఎస్టీబీసీ కళాశాల క్రీడా మైదానంలో వైఎస్సార్‌సీపీ నేతలు హెలిప్యాడ్ పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గురువారం ఉదయం 10.45 గంటలకు స్థానిక వైఎస్సార్ సర్కిల్ వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి పాల్గొంటారని చెప్పారు. కర్నూలు నియోజకవర్గంలోని కార్పొరేటర్లు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు.. మహిళలు వేలాదిగా తరలిరావాలని కోరారు. వీరి వెంట పార్టీ నాయకులు రసూల్, తోట వెంకట క్రిష్ణారెడ్డి, రాజశేఖర్ తదితరులు ఉన్నారు.



ఎస్టీబీసీ కళాశాల మైదానంలో హెలిప్యాడ్ పనులను పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

చేయూత నిధులను అడ్డుకున్నది చంద్రబాబే



బూరుగలలో ప్రజలకు అభివాదం చేస్తున్న మంత్రి బుగ్గన

- మళ్లీ వచ్చేది జగనన్న సంక్షేమ రాజ్యమే
- మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి

ప్యాపిలి: ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసి వైఎస్సార్ చేయూత నిధులు మహిళల ఖాతాల్లోకి జమ కాకుండా అడ్డుకున్న పాపం మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబుదేనని ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి అన్నారు. బూరుగల, కొలుపల్లి, వంకమెట్టుపల్లి, సీతమ్మతండా గ్రామాల్లో ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామాల్లో ఇంటింటి ప్రచారం, గ్రామాల్లో రోడ్‌షో చేపట్టారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వలంటీర్ల ద్వారా పింఛన్‌దారులకు ఠంచన్‌గా వస్తున్న పింఛన్‌ను కూడా చంద్రబాబు అడ్డుకున్నారన్నారు. బాబు నిర్వాకంతోనే రెండు నెలలుగా అవ్వాతాతలు, దివ్యాంగులు పింఛన్ డబ్బుల కోసం సచివాలయాలు, బ్యాంకుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. హామీలను తుంగలో తొక్కడంలో బాబు తర్వాతే ఎవరైనా అనే విషయం రాష్ట్ర ప్రజలందరికీ తెలుసన్నారు. అభివృద్ధి అంటే అర్థం తెలియని టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి చవకబారు విమర్శలు మానుకోవాలని మంత్రి హితవు పలికారు. 2019లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నవరత్నాలు హామీలను నెరవేర్చి పేదల పక్షపాతినని నిరూపించుకున్నారన్నారు. ఈ నెల 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను ఎంపీ, ఎమ్మెల్యేగా గెలిపించాలని మంత్రి కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బోరెడ్డి శ్రీరామిరెడ్డి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మెట్టు వెంకటేశ్వర్ రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ బొర్రా మల్లికార్జునరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా జనరల్ సెక్రటరీ శ్యాంరెడ్డి, సర్పంచులు భువనేశ్వరి, రామలక్ష్మీబాయి, వైఎస్సార్‌సీపీ నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, తులసిరెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, నరసింహారెడ్డి, జగదీశ్వరరెడ్డి, మధుసూదన్, పెద్దపుల్లారెడ్డి, శ్రీనివాసరెడ్డి, శ్యాంసుందర్ రెడ్డి, అంకాలగారి సుబ్బారెడ్డి, సాలన్న పాల్గొన్నారు.

అకాల వర్షం.. అపార నష్టం

- ఈదురు గాలులు, కుండపోత వర్షం
- అరటి రైతులకు భారీగా నష్టం
- నేలకొరిగిన 400 విద్యుత్ స్తంభాలు,
- కూలిపోయిన 40 ట్రాన్స్‌ఫార్మర్లు, నిలిచిపోయిన విద్యుత్ సరఫరా


నంద్యాల(అర్బన్)/గోస్పాడు/ఆళ్లగడ్డ/దొర్నిపాడు: జిల్లాలో మంగళవారం రాత్రి గాలీవాన బీభత్సం సృష్టించింది. ఈదురు గాలులతో పాటు ఉరుములతో వర్షం కురిసింది. జిల్లా కేంద్రం నంద్యాల పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల్లో ప్రధాన రహదారులన్నీ జలమయమయ్యాయి. గోస్పాడు, గడివేముల, బండిఆత్మకూరు, మహానంది తదితర ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. నంద్యాల పట్టణంలో మంగళవారం రాత్రి 8 గంటల నుంచి బుధవారం తెల్లవారుజాము 3 గంటల వరకు ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. పలు ప్రాంతాల్లో చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. గాంధీచౌక్ సర్కిల్‌లో రోడ్డు పక్కన పెట్టుకున్న తోపుడు బండ్లు ఈదురు గాలులకు కొట్టుకుపోయాయి. లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. సంజీవనగర్ గేటు, మున్సిపల్ ఆఫీసు, ఎస్‌బీఐ కాలనీ ఏటీఎం సెంటర్, సాయిబాబానగర్ ఆర్చి, చామకాల్వ సెంటర్, కోవెలకుంట్ల జంక్షన్ తదితర ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచి ఉండడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. వర్షం మొదలైనప్పటి నుంచి ఉదయం 10.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. నేలకొరిగిన విద్యుత్ స్తంభాల పునరుద్ధరణలో విద్యుత్ శాఖ అధికారులు నిమగ్నమయ్యారు. జాతీయ రహదారిపై, పలు మండలాల పరిధిలోని గ్రామాల్లో పెద్దపెద్ద వృక్షాలు నేలకూలాయి. మహానంది మండలంలో అరటి రైతులు భారీగా నష్టపోయారు. దాదాపు 750 ఎకరాల్లో అరటి చెట్లు నేలవాలడంతో రూ. 6 కోట్లకు పైగా నష్టం వాటిల్లినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. పలు ప్రాంతాల్లో రేకులషెడ్లు, పశువుల పాకలు గాలి వాన బీభత్సానికి ఎగిరిపడ్డాయి. చాపిరేవుల సమీపంలో జంగాల కులస్తుల గుడిసెలు కుప్పకూలడంతో రోడ్డున పడ్డారు. నంద్యాల విద్యుత్ సబ్ డివిజన్ పరిధిలో 400 విద్యుత్ స్తంభాలతో పాటు 40 ట్రాన్స్‌ఫార్మర్లు నేలకూలడంతో దాదాపు రూ.1.75 కోట్లు నష్టం వాటిల్లినట్లు విద్యుత్ శాఖ డీఈ రమణారెడ్డి తెలిపారు. గోస్పాడు మండలంలో 50 విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. చాగలమర్రి మండలంలో 76.4 మి.మీ వర్షపాతం నమోదైంది. రెండు ట్రాన్స్‌ఫార్మర్‌లు కాలిపోయి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.



చాపిరేవుల-కానాల రహదారిలో నేలకొరిగిన వృక్షం



మహానంది మండలం తిమ్మాపురంలో నేలకొరిగిన అరటి చెట్లు



నేలంపాడు గ్రామంలోని పొలంలో పడిపోయిన విద్యుత్ స్తంభం

మండలం	వర్షపాతం (మి.మీ)
చాగలమర్రి	76.4
శిరివెళ్ల	72
గడివేముల	65.2
బండిఆత్మకూరు	64.2
వెలుగోడు	52.2
పాణ్యం	51.4
తుగ్గలి	22.4
పత్తికొండ	15.2

చల్లబడిన వాతావరణం

కర్నూలు(అగ్రికల్చర్): గతంలో ఎప్పుడూ లేని విధంగా ఈ సారి వేసవి నిప్పుల వర్షం కురిపించింది. ఎండలు, వడగాడ్పులతో అల్లాడుతున్న ప్రజలకు వరుణుడు ఉపశమనాన్ని కల్పించారు. ఉన్నట్టుండి ఉమ్మడి కర్నూలు జిల్లాపై వరుణడు విరుచుకుపడ్డారు. ఉరుములు, మెరుపులు, పెనుగాలులు, వడగండ్లతో కూడిన వర్షాలు కురిశాయి. నంద్యాల జిల్లాలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురవగా.. కర్నూలు జిల్లాలో కొన్ని మండలాల్లో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు పడ్డాయి. నంద్యాల జిల్లాలో ఒక్క రాత్రిలోనే జిల్లా సగటున 37.4 మి.మీ వర్షపాతం నమోదు కావడం విశేషం. అవుకు మండలం మినహా మిగిలిన అన్ని మండలాల్లో వర్షం కురిసింది. పలు చోట్ల వడగండ్లు పడ్డాయి. ఎండల వేడిమితో ఉడికిన నంద్యాల జిల్లా ఒక్కసారిగా చల్లబడింది. అవుకులో ఏకంగా 102 మి.మీ వర్షపాతం నమోదైంది. గడివేముల మండలం పెసరవాయి గ్రామం వద్ద పిడుగు పడిన ఘటనలో 40 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. కర్నూలు జిల్లాలో మాత్రం వర్షాలు అంతంత మాత్రానికే పరిమితమయ్యాయి. కల్లూరు మండలం పెద్దటేకూరు-ఎర్రకత్వ తండా మధ్య భారీగా వడగండ్లు పడ్డాయి. ఇదిలాఉంటే కర్నూలు జిల్లాలో అత్యధికంగా గూడూరులో 39.6 డిగ్రీలు, అత్యల్పంగా తుగ్గలిలో 35 డిగ్రీల వర్షపాతం నమోదైంది. నంద్యాల జిల్లాలో అత్యధికంగా బేతంచెర్ల, చాగలమర్రిలో 38.3, అత్యల్పంగా శిరివెళ్లలో 33.2 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ 95.2 శాతం

నంద్యాల: జిల్లాలో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా జరుగుతుంది. జిల్లాలోని ఆరు నియోజకవర్గాల్లో పోస్టల్ బ్యాలెట్ ఓటర్లు 17,939 మంది ఉండగా 16,287 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ మూడు రోజుల్లో పోస్టల్ బ్యాలెట్ ఓట్లు 95.2 శాతం నమోదు అయ్యింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు మాట్లాడుతూ.. జిల్లాలోని ఒక పార్లమెంట్, ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ కేంద్రాల్లో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో జరిగిందన్నారు. ఇప్పటికే ఎన్నికల విధులు నిర్వహించే ఉద్యోగులు, పాత్రికేయులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారన్నారు. మూడవ రోజు బుధవారం 3,647 మంది అత్యవసర, ఇతర విభాగాలకు చెందిన ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకున్నారన్నారు. ఆళ్లగడ్డ నియోజకవర్గంలో 538 మంది ఓటర్లు, శ్రీశైలంలో 655, నందికొట్కూరులో 614, డోన్‌లో 511, నంద్యాలలో 824, బనగానపల్లెలో 505 మంది ఓటర్లు పోస్టల్ బ్యాలెట్ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు కలెక్టర్ తెలిపారు. మిగిలి ఉన్న ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బంది, ప్రధానమంత్రి పర్యటనలో ఉన్న పోలీస్ సిబ్బందికి గురువారం కూడా పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునే వెసులుబాటు కల్పించామన్నారు.



పోస్టల్ బ్యాలెట్ ఓటు హక్కును వినియోగించుకుంటున్న ఉద్యోగులు



ఆదోని టౌన్: ఆదోని పట్టణంలో వైఎస్సార్‌సీపీ నిర్వహించిన రోడ్‌షోకు హాజరైన ప్రజలు (ఇన్‌సెట్) మాట్లాడుతున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి



నందికొట్కూరు రూరల్: కోనేటమ్మపల్లిలో వైఎస్సార్‌సీపీ నందికొట్కూరు ఎమ్మెల్యే అభ్యర్థి దారా సుధీర్, శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డికి పూల వర్షం కురిపిస్తూ స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు



గోనెగండ్ల: జనసంద్రంగా మారిన వైఎస్సార్ సర్కిల్ (ఇన్‌సెట్) రోడ్‌షోలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మిగనూరు ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక



హొళగుంద: కామినేహాల్ రోడ్‌షోలో ప్రజలకు అభివాదం చేస్తున్న వైఎస్సార్‌సీపీ ఆలూరు నియోజకవర్గ అభ్యర్థి విరూపాక్షి

ప్రచార పర్వం

హారతులు పట్టి.. ఆశీర్వదించి

వైఎస్సార్‌సీపీ ప్రచారానికి ఊరూరా విశేష స్పందన లభిస్తోంది. పార్టీ అభ్యర్థులకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. పూలు చల్లుతూ.. భారీ పూలమాలలు వేస్తూ ఘన స్వాగతం పలుకుతున్నారు. మహిళలు హారతులు ఇచ్చి.. ఆశీర్వదిస్తున్నారు. ప్రజలతో మమేకమవుతూ వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. మంచి చేసిన ప్రభుత్వాన్ని మళ్లీ ఎన్నుకోవాలని కోరుతున్నారు. -సాక్షినెట్‌వర్క్



కర్నూలు సిటీ: కోడుమూరు నియోజకవర్గ పరిధిలోని కర్నూలు వార్డుల్లో ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిమూలపు సతీష్



కోసిగి: చిన్నభూంపల్లి గ్రామంలో టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి



ప్యాపిలి: బూర్గల గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తూ ఓటు అభ్యర్థిస్తున్న ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి



ఆత్మకూరు: చెర్మా కాలనీలో ప్రజలతో మమేకమవుతూ ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి



రుద్రవరం: చందలూరు గ్రామంలో ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డికి భారీ పూలమాల వేసి స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు



పత్తికొండ రూరల్: అటికెల గుండు గ్రామ రోడ్‌షోలో ప్రజలకు అభివాదం చేస్తున్న పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి



కల్లూరు: శరీన్‌నగర్‌లో జరిగిన వైఎస్సార్‌సీపీ సభకు భారీగా హాజరైన మహిళలు (ఇన్‌సెట్) మాట్లాడుతున్న పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి



నంద్యాల టౌన్: నంద్యాల పట్టణం 41వ వార్డులో రోడ్‌షోకు తరలివచ్చిన ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్ రెడ్డి



సంజామల: వైఎస్సార్‌సీపీ ప్రచారానికి తరలివచ్చిన ప్రజలు (ఇన్‌సెట్) ప్రసంగిస్తున్న బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి. చిత్రంలో నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి

జగనన్నకు మైనార్టీలంతా అండగా నిలవాలి

- వైఎస్సార్‌సీపీ పాణ్యం ఎమ్మెల్యే అభ్యర్థి కాటసాని రాంభూపాల్ రెడ్డి



ముస్లిం మతపెద్దల సమావేశంలో మాట్లాడుతున్న పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి

కర్నూలు (టౌన్): జగనన్నకు మైనార్టీలంతా అండగా నిలవాలని పాణ్యం ఎమ్మెల్యే అభ్యర్థి కాటసాని రాంభూపాల్ రెడ్డి పిలుపు నిచ్చారు. వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు షేక్ మహమ్మద్ ఇలియాస్ అధ్యక్షతన స్థానిక ఎస్.కె. ఫంక్షన్ హాలులో ముస్లిం మత పెద్దలు, ఇమాంలు, మోజన్లు, ఒలేమాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహానేత వైఎస్సార్ ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్లు అమలు చేసి ఎంతో మేలు చేశారన్నారు. ఎన్ని ఇబ్బందులు సృష్టించినా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగు శాతం రిజర్వేషన్లను కొనసాగించేందుకు కట్టుబడి పనిచేస్తున్నారన్నారు. అయితే ముస్లిం రిజర్వేషన్లు రద్దు చేస్తామని ప్రకటిస్తున్న భారతీయ జనతాపార్టీతో టీడీపీ జత కట్టడం సిగ్గుచేటన్నారు. వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం రాష్ట్ర అధ్యక్షులు ఖాదర్ బాషా మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీతోనే ముస్లింలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా మైనార్టీ విభాగం అధ్యక్షులు షేక్ మహమ్మద్ ఇలియాస్ మాట్లాడుతూ.. సామాజికంగా, ఆర్థికంగా ముస్లింలు అభివృద్ధి చెందాలంటే జగనన్నతోనే సాధ్యమన్నారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని విన్నవించారు. సమావేశంలో వైస్సార్‌సీపీ రాష్ట్ర మైనార్టీ కార్యదర్శులు నూరుబాబా, ఎస్. ఇక్బాల్ బాషా తదితరులు పాల్గొన్నారు.

డబ్బు పంపిణీలో తన్నుకున్న తమ్ముళ్లు

కొలిమిగుండ్ల: ఎన్నికల సమయం దగ్గర పడటంతో టీడీపీ నాయకులు గ్రామాల్లో డబ్బుల పంపిణీ మొదలు పెట్టారు. డబ్బులు ఇచ్చే విషయంలో టీడీపీ నాయకుల మధ్య విభేదాలు తారా స్థాయికి చేరుకుంటున్నాయి. బనగానపల్లె టీడీపీ అభ్యర్థి బీసీ జనార్ధనరెడ్డి ధనికుడు కావడంతో ఎన్నికల్లో కోట్ల రూపాయలు కుమ్మరిస్తున్నారు. ఇటీవలనే నందిపాడులో డబ్బులు ఎవరెవరికి ఇవ్వాలనే విషయంలో టీడీపీకి చెందిన రెండు వర్గాలు గొడవ పడి పోలీస్ స్టేషన్‌లో ఒకరిపై ఒకరు కేసులు పెట్టుకున్నారు. తాజాగా బుధవారం నాగిశెట్టిపల్లెలో తెలుగు తమ్ముళ్లు తన్నుకున్నారు. గ్రామంలో కమ్మ సామాజిక వర్గం నాయకులు ఎక్కువగా ఉన్నారు. అదే సామాజిక వర్గానికి చెందిన టీడీపీ నాయకులు ఇంటింటికి వెళ్లి టీడీపీ అభ్యర్థి బీసీ జనార్ధనరెడ్డి తరఫున ఓటుకు రూ.2వేలు చొప్పున పంపిణీ చేస్తున్నారు. గ్రామంలో కొంత మందికి డబ్బులు ఇవ్వకూడదని ఒక వర్గం, ఇవ్వాలని మరొక వర్గం టీడీపీ నాయకుల మధ్య వాదోపవాదాలు చోటు చేసుకున్నాయి. మాటా మాటా పెరిగి చివరకు చెప్పులతో కొట్టుకునే వరకు దారితీసింది. టీడీపీ నాయకులు జోక్యం చేసుకోవడంతో వివాదం సద్దుమణిగింది.

సామాజిక రాయ'బేరాలు'

- కర్నూలులో ముస్లిం ఓట్లను చీల్చేందుకు బీజేపీ నేత కుతంత్రాలు
- 'నోట్ల'తో ఓట్లు కొనేందుకు కుట్రలు
- తండ్రీ, కుమారుడి ఎత్తుగడలను చూసి ఛీకొడుతున్న ప్రజలు



కర్నూలు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ముస్లింలు ప్రధాన ఓటు బ్యాంకుగా ఉండటంతో ఓ బీజేపీ నేత కుట్రలు పన్నుతున్నారు. ఆ సామాజిక వర్గానికి చెందిన ఓట్లను తన కుమారుడికి వచ్చేలా కుతంత్రాలు పన్నుతున్నారు. ఈ క్రమంలో కొంతమంది మతపెద్దలతో సమావేశమవుతూ ఇప్పటివరకు వారికి తోడ్పాటు అందించిన విషయాలు చెబుతూ ఈ ఎన్నికల్లో ఎలాగైనా సహాయం చేయాలని కోరుతున్నారు. కర్నూలు శాసనసభ నియోజకవర్గంలో 1.15 లక్షల మంది మైనార్టీ ఓటర్లు ఉన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్‌కు గత ఎన్నికల్లో ఆ సామాజిక వర్గం వారు అండగా నిలిచారు. ఈసారి కూడా అదే జరిగితే రాజకీయ భవిష్యత్తు ఇరకాటంలో పడుతుందని భావించిన బీజేపీ నేత ముస్లిం ఓట్లను చీల్చేందుకు ఎత్తుగడ వేశారు. కొన్ని రోజులుగా వరుసగా ఆ సామాజిక వర్గానికి చెందిన కొంతమంది పెద్దలతో తన కార్యాలయంలో చర్చలు జరుపుతున్నారు. కొంతమేరకైనా ముస్లిం ఓట్లు తన కుమారునికి వచ్చేటట్లు నజరానాలు ప్రకటిస్తున్నారు. ఆ సామాజిక వర్గంలో కీలకంగా ఉండే మరికొందరికి ఎర వేస్తున్నట్లు చర్చ జరుగుతోంది.

తాయిలాల ఎర

ప్రచారానికి మరో మూడు రోజులే గడువు ఉన్నా కుమారుని వెంట ప్రచారం కంటే తెర వెనుక ఉండి వ్యూహ రచనకే బీజేపీ నేత ప్రాధాన్యమిస్తున్నాడు. ముఖ్య నేత పర్యటనలో ఒకటిరెండు సార్లు మినహా కుమారుని ప్రచారంలో ఆయన పాల్గొన్న దాఖలాలు లేవు. అందుకు ప్రధాన కారణం ఆయన బీజేపీలో ఉండటం. తెలుగుదేశం పొత్తుతో ముస్లిం ఓట్లు దూరమవుతాయన్న భయం ఆయనను వెంటాడుతోంది. ఎన్నికలు ఆయనకు అగ్నిపరీక్షగా మారాయి. ప్రత్యర్థి కంటే ఒక్క ఓటైనా ఎక్కువ సాధించకపోతే రాజకీయ భవిష్యత్తు ప్రశ్నార్థకమేనని ఆయన భావిస్తున్నారు. ఇటీవల స్టార్ హోటల్‌లో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఈ విషయాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించారు. బూత్ స్థాయిలో ఎవరు ఎక్కువ ఓట్లు తీసుకువస్తే వారికి ఫారిన్ టూర్ ఏర్పాటు చేస్తానని, అందుకు కష్టపడాలని బూత్ కమిటీ సభ్యుల సమావేశంలో స్వయంగా అభ్యర్థి ప్రకటించడం హాట్ టాపిక్‌గా మారింది.

ప్రలోభాలనే నమ్ముకుని...

బీజేపీ నేత, ఆయన కుమారుడు ప్రలోభాలనే ప్రధానంగా నమ్ముకున్నారు. సామాన్య, మధ్యతరగతి ప్రజలకు డబ్బు ఆశ చూపి ఓట్లు రాబట్టాలని చూస్తున్నారు. ఓటుకు రూ.1,500 నుంచి రూ.2 వేలు చొప్పున ఇంట్లో ఎంతమంది ఉంటే అంత మొత్తాన్ని అందించేలా కార్యాచరణ సిద్ధం చేసి అమలు చేస్తున్నారు. రోజువారీ పనికి వెళ్లే కూలీలు రోడ్డుపైడు చిన్న వ్యాపారులపై దృష్టి సారించి నగదు, ఇతర తాయిలాలతో గాళం వేస్తున్నారు. ప్రచారంలోనూ భోజనాలతో పాటు నగదు ఇస్తూ అభ్యర్థి తనవెంట తిప్పుకుంటున్నాడు.

బూటకపు హామీలిస్తూ...

గత ఎన్నికల్లో ఎక్కువ ఓట్లు వచ్చిన ప్రాంతాలు, తక్కువ ఓట్లు వచ్చిన వార్డులను గుర్తించి యువకులకు డబ్బులతో ఎర వేస్తున్నారు. ముస్లింలకు ప్రయోజనాలు చేకూరుస్తామని బూటకపు హామీలిస్తున్నారు. మూడు నెలలుగా జీతాలు ఇస్తూ ఏర్పాటు చేసుకున్న బూత్ కమిటీ సభ్యులు, పరిశ్రమలో పనిచేసే నమ్మకస్తులైన ఉద్యోగులు, బంధువులు, సామాజిక వర్గం అనుచరులను రంగంలోకి దింపి డబ్బు పంపిణీ బాధ్యతలు అప్పగించారు. కొంతమందికి నగదు గాను, మరికొంతమందికి మరో మార్గంలో చెల్లింపులు జరిగిపోతున్నాయి. ఎన్నికల అధికారులేమో ప్రేక్షక పాత్రకే పరిమితమయ్యారనే విమర్శలు వినిపిస్తున్నాయి. టీడీపీ నేత పంపిణీకి సిద్ధం చేసిన రూ.2 లక్షలు విలువ చేసే చీరలు పట్టుబడినప్పటికీ ఎన్నికల సంఘం అధికారులు కేసు నమోదు చేసి వదిలేశారన్న చర్చ జరుగుతోంది.

విత్తన ప్రాసెసింగ్ యూనిట్ల తనిఖీలకు ప్రత్యేక సిబ్బంది

కర్నూలు(అగ్రికల్చర్): ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి సబ్సిడీపై పంపిణీ చేసే వేరుశనగ, ఇతర విత్తనాల ప్రాసెసింగ్ యూనిట్ల తనిఖీలకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు అయ్యాయి. జిల్లాకు సంబంధించి నాలుగు ప్రాసెసింగ్ యూనిట్లు ఉన్నాయి. ఇప్పటికే ఒకటి, రెండు చోట్ల వేరుశనగ ప్రాసెసింగ్ మొదలైంది. రైతులకు నాణ్యమైన వేరుశనగ అందించాలనే లక్ష్యంతో ప్రాసెసింగ్ యూనిట్ల తనిఖీలకు వ్యవసాయ ఉన్నతాధికారులు ప్రత్యేకంగా ఏఈవోలను నియమించారు. మహంకాళేశ్వర అగ్రిటెక్‌కు ఏఈవో చాంద్‌బాషా, చక్రాసీడ్స్‌కు ఏఈవో శ్రీనివాసులు, శ్రీకృష్ణ సీడ్స్‌కు ఏఈవో ఉసేన్‌పీరా, శివసాయి సీడ్స్‌కు అహ్మద్‌హుసేన్ నియమితులయ్యారు. వీరిపైన ప్రాసెసింగ్ యూనిట్లను కల్లూరు ఏవో శ్రీనివాసరెడ్డి, ఏడీఏ సాలురెడ్డి పర్యవేక్షిస్తారని అధికార వర్గాలు తెలిపాయి.

యువకుడి ఆత్మహత్య



భాస్కర్‌నాయుడు(ఫైల్)

ఎమ్మిగనూరురూరల్: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ఓ లాడ్జిలో బుధవారం ఉరివేసుకొని భాస్కర్ నాయుడు (22) అనే యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. గోనెగండ్ల మండలం గంజిహళ్లి గ్రామానికి చెందిన ఈ యువకుడు స్వయాన తన అక్క కుమార్తె అయిన పుష్పను వివాహం చేసుకున్నాడు. ప్రకాశం జిల్లా మార్కాపురంలో స్పేర్స్‌వేర్ షాప్ ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. వీరికి సంస్కృతి, జస్విత, జగదీశ్వర్ అనే ముగ్గురు సంతానం ఉన్నారు. కొన్ని నెలలుగా భార్యాభర్తల మధ్య మనస్పర్థలు వచ్చాయి. భార్య తన పుట్టినిల్లు సోగనూరులో ఉంటోంది. ఇరు కుటుంబాలకు చెందిన వారు పంచాయితీ చేసి భార్యాభర్తలకు సర్దిచెప్పారు. భాస్కర్‌నాయుడు తమ బంధువులతో కలసి రెండు రోజులుగా లాడ్జిలో ఉంటున్నాడు. బుధవారం మధ్యాహ్నం తనతో పాటు లాడ్జిలో ఉన్న వ్యక్తి భోజనం ప్యాకెట్ తీసుకురావాటానికి కిందకు వెళ్లగా భాస్కర్‌నాయుడు బెడ్‌షీట్‌కు ఉండే బట్టను తీసుకొని ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. భోజనం ప్యాకెట్ తీసుకువచ్చిన వ్యక్తి తలుపు వేసివుండటం చూసి లాడ్జీవారిని పిలిచి బద్దలు కొట్టారు. ఫ్యాన్‌కు వేలాడుతుండటంతో వెంటనే పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని కిందకు దించి పోస్టుమార్టం కోసం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పట్టణ పోలీసులు తెలిపారు.

యువకుని తొడలోకి చొచ్చుకుపోయిన చెట్టుకొమ్మ



తొడలో చొచ్చుకుపోయిన చెట్టుకొమ్మ,ఆపరేషన్ అనంతరం యువకునితో వైద్యుల బృందం

- చాకచక్యంగా ఆపరేషన్ చేసి తొలగించిన పెద్దాసుపత్రి వైద్యులు

కర్నూలు(హాస్పిటల్): రోడ్డు ప్రమాదంలో అదుపు తప్పి కింద పడటంతో ప్రమాదవశాత్తూ చెట్టుకొమ్మ ఓ యువకుని తొడలోకి చొచ్చుకుపోయింది. దానికి కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల వైద్యులు ఎంతో చాకచక్యంగా తొలగించి ఆ యువకునికి ప్రాణాలు పోశారు. తెలంగాణ రాష్ట్రం గద్వాల జిల్లా మానవపాడు మండలం అమరవాయి గ్రామ శివారులో ఈ నెల 2వ తేదీన మాలిక్‌బాషా(19) అనే యువకుడు ఇసుకతో కూడిన ట్రాక్టర్ నడుపుతూ ప్రమాదానికి గురయ్యాడు. లోడుతో ఉన్న ట్రాక్టర్ వేగంగా వెళ్తుండటంతో అదుపు తప్పి పక్కనే ఉన్న చెట్టుకొమ్మకు యువకుని కుడి తొడపైకి ఒకవైపు నుంచి మరోవైపునకు చొచ్చుకుపోయింది. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికుల సహాయంతో బాధితుడిని సమీపంలోని ప్రాథమిక వైద్య కేంద్రానికి తరలించారు. అక్కడి వైద్యుల ఆదేశాల మేరకు మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు తీసుకొచ్చారు. ఆసుపత్రిలోని క్యాజువాలిటీ విభాగంలో ప్రాథమిక చికిత్స అనంతరం అత్యవసర ఆపరేషన్ థియేటర్‌లో జనరల్ సర్జన్ డాక్టర్ చక్రవర్తి నేతృత్వంలోని వైద్యబృందం డాక్టర్ విజయశంకర్, డాక్టర్ భాస్కరరెడ్డి, డాక్టర్ అనూష, డాక్టర్ జగన్‌మోహన్‌రెడ్డి శస్త్రచికిత్స నిర్వహించగా డాక్టర్ సంధ్యారాణి అనెస్తీషియా ఇచ్చారు. ఈ మేరకు ఆ యువకుని తొడకు చుట్టుపక్కల ఉన్న సిరలు, ధమనులు, నరాలకు ఎలాంటి ప్రమాదం కలగకుండా మూడున్నర గంటల పాటు శ్రమించి చొచ్చుకుపోయిన చెట్టు కొమ్మను విజయవంతంగా తొలగించారు. బుధవారం జనరల్ సర్జరీ విభాగంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి. వెంకటరంగారెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ రోగులకు ఆరోగ్యశ్రీ లేకపోయినా ఆ యువకుని కాలు తీసేయకుండా ప్రాణాలు కాపాడిన వైద్యబృందాన్ని అభినందించారు. సమావేశంలో కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టి నర్సమ్మ, వైస్ ప్రిన్సిపాల్, జనరల్ సర్జరీ హెచ్‌వోడీ డాక్టర్ హరిచరణ్, సర్జరీ విభాగం వైద్యులు డాక్టర్ చక్రవర్తి, డాక్టర్ రామకృష్ణ నాయక్, డాక్టర్ విజయశంకర్, డాక్టర్ భాస్కరరెడ్డి, అనెస్తీషియా హెచ్‌వోడీ డాక్టర్ విశాల తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కర్నూలు చేరుకున్న ఎన్నికల ప్రత్యేక వ్యయ పరిశీలకురాలు



నీనానిగమ్‌కు స్వాగతం పలుకుతున్న కలెక్టర్ డాక్టర్ జి.సృజన

కర్నూలు(సెంట్రల్): ఎన్నికల ప్రత్యేక వ్యయ పరిశీలకురాలు నీనా నిగమ్ బుధవారం సాయంత్రం కర్నూలు చేరుకున్నారు. ఆమెకు కలెక్టర్ డాక్టర్ జి.సృజన స్వాగతం పలికారు. జిల్లాలోని ఎన్నికల వ్యయం, ఇతర అంశాలపై కాసేపు చర్చించారు. గురువారం జిల్లా అధికారులతో ఆమె సమావేశం అయ్యే అవకాశం ఉంది.

వ్యాధి నిర్ధారణలో ల్యాబ్ టెక్నీషియన్లు కీలకం



మైక్రోస్కోప్‌తో రక్త నమూనా పరిశీలిస్తున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ వెంకటరమణ

నంద్యాల టౌన్: రక్త నమూనాల సేకరణ, వ్యాధి నిర్ధారణ పరీక్షల్లో ల్యాబ్ టెక్నీషియన్లు కీలక పాత్ర పోషిస్తారని జిల్లా వైద్య ఆరోగ్యాధికారి డాక్టర్ వెంకటరమణ అన్నారు. బుధవారం పట్టణంలోని గాంధీనగర్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో జిల్లా మలేరియా అధికారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ల్యాబ్ టెక్నీషియన్ల శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రయోగశాలల్లో వ్యాధి నిర్ధారణ పరీక్షలు కచ్చితత్వంతో నిర్వహించి రిపోర్టులు ఇవ్వాలన్నారు. వీటి ఆధారంగానే రోగులకు సరైన చికిత్స అందించగలమన్నారు. జిల్లా మలేరియా అధికారి కామేశ్వరరావు మాట్లాడుతూ ప్రస్తుతం మలేరియా ఎలిమినేషన్ దశలో ఉందని, మరింత విస్తృతంగా పరీక్షలు నిర్వహించి పూర్తిగా నిర్మూలించడమే లక్ష్యంగా ల్యాబ్ టెక్నీషియన్లకు శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు.

వన్యప్రాణి వేటగాళ్ల అరెస్ట్

మహానంది: మహానంది సమీపంలోని నల్లమల అడవిలో వన్యప్రాణి వేటగాళ్లను అటవీశాఖ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. మహానంది, గోపవరం గ్రామాలకు చెందిన ఆరుగురు కణితిని వేటాడి మాంసం తీసుకెళ్తుండగా సమాచారం మేరకు డీఆర్‌ఓ హైమావతి, ఎఫ్‌బీఓ ప్రతాప్ ఘటనా స్థలానికి చేరుకుని ఐదుగురిని అదుపులోకి తీసుకుని, సుమారు మూడు కిలోల కణితి మాంసాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. మంగళవారం డీఆర్‌ఓ హైమావతి మాట్లాడుతూ అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నామని, పూర్తి వివరాలు బుధవారం వెల్లడిస్తామని చెప్పారు.

మహిళలపై దాడులు హేయమైన చర్య



డాక్టర్ శశికళారెడ్డి

బొమ్మలసత్రం: చంద్రబాబు ఓటమి భయంతో చివరికి మహిళలను కూడా వదలకుండా దాడులు చేయిస్తున్నారని, ఇది హేయమైన చర్య అని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు డాక్టర్ శశికళా రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. చంద్రబాబు ఓటమి భయంతో ఉన్మాదిలా ప్రవర్తిస్తున్నారని ఆరోపించారు. గోపాలపురం నియోజకవర్గంలో హోంమంత్రి తానేటీ వనితపై దాడి చేయడం, విజయవాడలో మహిళలపై టీడీపీ నేత బోండా ఉమ అనుచరులు దాడి చేయటం క్రూరమైన చర్యగా అభివర్ణించారు. అదే విధంగా బనగానపల్లి నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ నాయకులపై దాడులు జరిగాయన్నారు. ఇవన్నీ చూస్తుంటే చంద్రబాబులో ఉన్న రాక్షసత్వం బయటపడుతున్నట్లు అనిపిస్తోందన్నారు.

అకాల వర్షం.. అపార నష్టం

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లాలో పెనుగాలులతో కురిసిన అకాల వర్షాల వల్ల విద్యుత్‌శాఖకు అపార నష్టం వాటిల్లింది. 13 గ్రామాల్లో పెనుగాలుల ప్రభావం వల్ల విద్యుత్ శాఖకు రూ.1.57 కోట్ల మేర నష్టం జరిగింది. 33 కెవి పోల్స్ 45 కూలిపోగా.. 2.7 కిలోమీటర్ల మేర లైన్ దెబ్బతింది. 11 కేవి పోల్స్ 374 కూలిపోయాయి. 18.6 కిలోమీటర్ల లైన్ దెబ్బతింది. ఎల్‌టీ పోల్స్ 146 విరిగిపడ్డాయి. లైన్ 8.76 కిలోమీటర్లు దెబ్బతింది. మొత్తంగా 565 పోల్స్, లైన్ 30.6 కిలోమీటర్లు పెనుగాలుల తీవ్రతకు దెబ్బతింది. 28 ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయాయి. విద్యుత్ పోల్స్, లైన్ పునరుద్ధరించడంలో విద్యుత్ అధికారులు నిమగ్నమయ్యారు.

ఉరుముల ధాటికి వృద్ధురాలి మృతి

జూపాడుబంగ్లా: మండలంలోని తంగడంచ గ్రామంలో మంగళవారం రాత్రి ఉరుములతో కూడిన వర్షం కురవగా.. ఉరుముల శబ్దానికి గ్రామానికి చెందిన స్వామక్క(61)అనే వృద్ధురాలు గుండెపోటుకు గురై మృతిచెందింది. మృతురాలు ఇంట్లోని వరండాలో మంచంపై పడుకొనిందని.. ఉదయం లేపేందుకు యత్నించగా లేవలేదని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. రాత్రి ఉరుముల శబ్దానికి గుండెపోటుకు గురై మృతిచెందినట్లు వెల్లడించారు.

నన్నూరు..అభివృద్ధి జోరు!

- ఐదేళ్ల వైఎస్ జగన్ పాలనలో విరిసిన అభివృద్ధి కుసుమాలు
- సీసీ రోడ్లు, ప్రాధాన్యత భవన నిర్మాణాలతో మారిన పల్లె రూపురేఖలు
- పీఆర్ ఆధ్వర్యంలోనే రూ.5.51 కోట్లతో అభివృద్ధి పనులు
- 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.19.75 లక్షలతో వివిధ పనులు
- నవరత్నాలతో రూ.26.17 కోట్ల లబ్ధి



నన్నూరు శివారులో ఒకే ప్రాంగణంలో నిర్మించిన గ్రామ సచివాలయం, ఆర్‌బీకే, వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనాలు

కర్నూలు – నంద్యాల జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న నన్నూరు గ్రామం అభివృద్ధి పథాన దూసుకుపోతోంది. టీడీపీ హయాంలో అభివృద్ధి విషయంలో ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా ఉన్న నన్నూరు.. ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో రూపురేఖలే మారిపోయాయి. సచివాలయం, ఆర్‌బీకే, వైఎస్సార్ హెల్త్‌క్లినిక్ తదితర సేవలన్నీ ఒకే చోట ఏర్పాటు చేయడంతో పాటు గ్రామంలో సీసీ రోడ్లు, లింక్ రోడ్ల నిర్మాణంతో గ్రామం కొత్త శోభను సంతరించుకుంది.

ఖర్చు చేసిన పీఆర్ నిధుల వివరాలు..

పని	ఖర్చు
రెండు గ్రామ సచివాలయాలు (ఒక్కొక్కటి రూ.20 లక్షలు)	రూ.80 లక్షలు
మూడు ఆర్‌బీకేలు (ఒక్కొక్కటి రూ.23.94 లక్షలు)	రూ.71.82 లక్షలు
రెండు వైఎస్సార్ హెల్త్ క్లినిక్స్ (ఒక్కొక్కటి రూ.20.80 లక్షలు)	రూ.41.60 లక్షలు
నన్నూరు – తడకనపల్లె బైపాస్ రోడ్డు (0.75 కి.మీ)	రూ.55 లక్షలు
రాగమయూరి కాలనీలో ప్రహరీ, సీసీ రోడ్లు	రూ.50 లక్షలు
ఆంధ్రాబ్యాంకు ముందు సీసీ రోడ్డు	రూ.8 లక్షలు
జగనన్న హౌసింగ్ కాలనీలో అప్రోచ్ రోడ్డు	రూ.45 లక్షలు
గ్రామంలో ఇరుకు వంతెన స్థానంలో కొత్త వంతెన నిర్మాణం	రూ.2 కోట్లు

కర్నూలు(అర్బన్): ఓర్వకల్లు మండల పరిధిలోని నన్నూరు గ్రామం అభివృద్ధిలో కొత్త పుంతలు తొక్కుతోంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, ఇక్కడి ప్రజల దశాబ్దాల కష్టాలు పటాపంచలయ్యాయి. నడవడానికి కూడా ఇబ్బంది పడుతున్న పలు వీధులు నేడు సీసీ రోడ్లతో కళకళలాడుతున్నాయి. ముఖ్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రాధాన్యత భవన (గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్స్) నిర్మాణాలు పల్లెకు కొత్త అందాలను తీసుకువస్తున్నాయి. ఒకే ప్రాంగణంలో ఈ మూడు భవనాలను నిర్మించడంతో పల్లె ప్రజలు ఎంతో సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఓ వైపు గ్రామంలో రోడ్లను విస్తరించడంతో పాటు ఇరుకు వంతెన స్థానంలో రూ.2 కోట్లు వెచ్చించి కొత్త వంతెన నిర్మాణం పూర్తి కావడం వల్ల ప్రజల రాకపోకలకు ఉన్న ఇబ్బందులు తొలగిపోయాయి. పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ శాఖ ఆధ్వర్యంలోనే నన్నూరు గ్రామంలో రూ.5.51 కోట్లతో అభివృద్ధి పనులు జరిగాయంటే అతిశయోక్తి కాదు.

15వ ఆర్థిక సంఘం నిధులతో ..

15వ ఆర్థిక సంఘం నిధులతో కూడా గ్రామంలో పలు అభివృద్ధి పనులు చేపట్టారు. రూ.2.50 లక్షలతో తోగటయ్య అండ్ బైరెడ్డి నగర్, బీసీ కాలనీలో పైప్ లైన్ విస్తరణ పనులు పూర్తి చేశారు. రూ.6.25 లక్షలతో ఎంపీడీఓ కార్యాలయంలో ప్రత్యేక మరమ్మతులు, రూ.1.50 లక్షలతో జెడ్పీ హైస్కూల్‌లో బోరు ఏర్పాటు, రూ.5 లక్షలతో జాతీయ రహదారి నుంచి జగనన్న కాలనీకి వెళ్లే దారిలో కల్వర్టు, రోడ్డుకు గ్రావెల్ వేశారు. చేతి పంపుల స్పేర్ పార్ట్స్‌కు రూ.4 లక్షలను వెచ్చించారు.

నవరత్నాలతో రూ.26.17 కోట్ల లబ్ధి

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మేనిఫెస్టోలో ప్రకటించిన 'నవరత్నాల్లో' భాగంగా గ్రామంలోని 4,582 మందికి వివిధ పథకాల ద్వారా రూ.26.17 కోట్ల మేర లబ్ధి చేకూరింది.

వివిధ పథకాల ద్వారా లబ్ధి పొందిన వివరాలు (నాలుగున్నరేళ్లలో)

పథకం	లబ్ధి పొందిన వారు	మొత్తం (రూ.లక్షల్లో)
పెన్షన్లు	1102	రూ.1,288.30
వైఎస్సార్ చేయూత	621	రూ.260.80
అమ్మ ఒడి	675	రూ.548.60
జగనన్న విద్యా దీవెన	169	రూ.163.20
జగనన్న వసతి దీవెన	169	రూ.133.60
వైఎస్సార్ కాపు నేస్తం	08	రూ.4.40
జగనన్న చేదోడు	41	రూ.12.30
వైఎస్సార్ వాహన మిత్ర	78	రూ.31.40
జగనన్న తోడు	84	రూ.47.20
సంపూర్ణ పోషణ	91	---
జగనన్న విద్యా కానుక	503	---
వైఎస్సార్ ఆసరా	1,004	రూ.130.10
ఈబీసీ నేస్తం	37	రూ.8.20

నన్నూరు గ్రామ జనాభా వివరాలు (2011 జనాభా లెక్కల ప్రకారం)

మొత్తం కుటుంబాలు	2,030
ఎస్సీలు	1,926
ఎస్టీలు	42
ఇతరులు	8,964
ఇందులో పురుషులు	5,535.
మహిళలు	5,397
మొత్తం జనాభా	10,932

ఆఫీసులన్నీ ఒకే చోట ఉండడం సంతోషం



గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్ కార్యాలయాలన్నీ ఒకే ప్రాంగణంలో ఉండడం చాలా సంతోషంగా ఉంది. రైతులు, విద్యార్థులు, ప్రజలకు వివిధ పనుల నిమిత్తం ఒక చోటి నుంచి ఇంకో చోటికి వెళ్లే అవస్థలు తప్పాయి. ఎవరికి ఏ కార్యాలయంలో పని ఉన్నా, కలిసి వెళ్లేందుకు అవకాశం ఏర్పడింది. – ఫాతిమాబీ, నన్నూరు

వంతెన ఇబ్బందులు తొలగాయి



నన్నూరు ఊరి మధ్యలో ఉన్న ఇరుకు వంతెనతో చాలా ఇబ్బంది పడ్డాం. కనీసం ఒక వాహనం లేదా ఎద్దుల బండి పోవాలంటే కూడా చాలా ఇబ్బంది ఉండేవి. ప్రస్తుతం రూ.2 కోట్లు వెచ్చించి వెడల్పుగా కొత్త వంతెనను నిర్మించడం వల్ల రెండు వాహనాలు సులభంగా వెళ్లేందుకు అవకాశం ఏర్పడింది. పైగా రోడ్డు కూడా విశాలంగా తయారు కావడం, వంతెన కింద వర్షపు నీరు కూడా ఇబ్బంది లేకుండా దిగువకు పోతోంది.

– మద్దయ్య, ఆటో డ్రైవర్

సౌకర్యంగా బైపాస్ రోడ్డు



నన్నూరు మెయిన్ రోడ్డు నుంచి తడకనపల్లె వెళ్లేందుకు గతంలో రోడ్డంతా గుంతలు పడి చాలా అధ్వానంగా ఉండేది. ఈ రోడ్డు నుంచి వెళ్లాలంటే ఎక్కడ ప్రమాదాలు జరుగుతాయో అని భయపడే వాళ్లం. ప్రస్తుతం రూ.55 లక్షలు ఖర్చు చేసి బైపాస్ రోడ్డు వేయడం వల్ల ప్రయాణం సులభమైంది.

– పండిపాటి షరీఫ్, నన్నూరు



గ్రామంలో కొత్తగా నిర్మించిన సీసీ రోడ్డు



రూ.2 కోట్ల వ్యయంతో నిర్మించిన వంతెన



రూ.55 లక్షలతో ఏర్పాటు చేసిన నన్నూరు-తడకనపల్లె బైపాస్ రోడ్డు

ఫ్యాక్షన్‌ను ప్రోత్సహించే కోట్లను తరిమేయండి

- జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ మద్దూరు సుభాష్ చంద్రబోస్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ మద్దూరు సుభాష్ చంద్రబోస్

డోన్: హత్యా రాజకీయాలతో ఫ్యాక్షన్‌ను ప్రోత్సహించే టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డిని తరిమికొట్టాలని ఉమ్మడి కర్నూలు జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ మద్దూరు సుభాష్ చంద్రబోస్ అన్నారు. మంత్రి స్వగృహంలో బుధవారం ఆయన మాట్లాడుతూ.. ఫ్యాక్షన్ రాజకీయాలతో డోన్ నియోజకవర్గ ప్రజలు అంతులేని నష్టాన్ని చవిచూశారన్నారు. వందలాది మంది ప్రాణాలు పోగొట్టుకున్నారన్నారు. ఇలాంటి పరిస్థితులు రూపుమాపి గత పదేళ్లుగా నియోజకవర్గంలో ప్రశాంత వాతావరణం నెలకొనేందుకు ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ఎంతో కృషి చేశారన్నారు. నియోజకవర్గంలో ప్రశాంత జీవనం కావాలా? హత్యారాజకీయాలు కావాలో? ప్రజలే నిర్ణయించుకోవాలన్నారు. నియోజకవర్గంలో అభివృద్ధి లేదంటూ టీడీపీ అభ్యర్థి కోట్లతో పాటు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వలసల రామకృష్ణ తదితరులు తరచూ ఆరోపించడాన్ని ఆయన ప్రస్తావిస్తూ వారి కళ్లకు పచ్చపొరలు ఏర్పడ్డాయన్నారు. వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వం నిర్మించిన వంద పడకల ఆసుపత్రిలో ఉచితంగా ఆపరేషన్లు చేయించి పచ్చ పొరలను తీయిస్తామని సుభాష్ చంద్రబోస్ అన్నారు. 20 ఏళ్ల క్రితం సీపీఐ కార్యదర్శిగా ఉన్న వలసల రామకృష్ణను సీపీఐ కార్యాలయం ఉండగానే హత్యయత్నానికి పాల్పడింది కోట్ల వర్గీయులు కాదా అని ప్రశ్నించారు. అలాంటి నాయకుడి వెంట నేడు రామకృష్ణ ఉండటం అవివేకమన్నారు. 15 ఏళ్ల క్రితం నియోజకవర్గ ప్రజలకు చెప్పా చేయకుండా ఆలూరుకు పారిపోయిన కోట్ల సుజాతమ్మ ఇక భవిష్యత్తులో ఇంటికే పరిమితమవుతుందన్నారు హితవు చెప్పారు. ఈ ఎన్నికల్లో అభివృద్ధి చేసే బుగ్గనకు, ఫ్యాక్షన్ రాజకీయాలను ప్రోత్సహించే కోట్లకు తేడా గమనించాలన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తిరిగి అధికారంలోకి రావడం తథ్యమన్నారు.

ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న అధికారులు, విద్యార్థినిలు

కర్నూలు(హాస్పిటల్): జిల్లాలో ఈ నెల 13వ తేదీన జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఒక్క ఓటరు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని స్వీప్ నోడల్ అధికారి పీవీ రమణ, రవీంద్ర విద్యాసంస్థల ఛైర్మన్ జీవీ మోహన్‌కుమార్ కోరారు. బుధవారం స్థానిక రవీంద్ర మహిళా ఇంజినీరింగ్ కళాశాల, జి.పుల్లయ్య ఇంజినీరింగ్ కళాశాలలోని విద్యార్థులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ మే 13న ఓటు వేద్దాం–ఓటు మన హక్కు–మన సామాజిక బాధ్యత అని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పీవీ రమణ, జీవీ మోహన్‌కుమార్ మాట్లాడుతూ మొదటిసారిగా యువ ఓటరుగా నమోదై ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఉత్సాహంగా ఎదురుచూస్తున్నారన్నారు. మీరు ఓటు వేయడమే గాకుండా మీ కుటుంబసభ్యులు, పరిసర ప్రాంత ఓటర్లందరూ ఓటు వేసే విధంగా చూడాలని విద్యార్థులను కోరారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేఈ. శ్రీనివాసమూర్తి, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ అధికారి మురళీధర్‌నాయక్ పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

డోన్ టౌన్: పట్టణ సమీపంలోని జాతీయ రహదారిపై ఉన్న శ్రీలక్ష్మీనరసింహా డాబా సమీపంలో కర్ణాటక మద్యం విక్రయిస్తున్న ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకోని మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మంగళవారం రాత్రి డాబాలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో ఎస్ఐ శరత్‌కుమార్‌రెడ్డితో కలసి దాడి చేశామన్నారు. ఉడుములపాడు గ్రామానికి చెందిన బోయదొడ్డి తిమ్మప్ప వద్ద ఉన్న కర్ణాటకకు చెందిన 384 టెట్రా మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. తిమ్మప్పను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నామన్నారు. మద్యం సరఫరా చేసిన ప్రతాప్ పరారీలో ఉన్నట్లు సీఐ తెలిపారు. వీరిద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



ప్రమాదంలో మృతిచెందిన శ్రీనివాసులు

బొమ్మలసత్రం: నంద్యాల మండలం కొత్తపల్లి గ్రామ సమీపంలో రహదారిపై బుధవారం ఆర్టీసీ బస్సు, కారు ఢీకొని చాకలి శ్రీనివాసులు (35) మృతిచెందాడు. ట్రాఫిక్ సీఐ ఇస్మాయిల్ తెలిపిన వివరాల మేరకు.. బండిఆత్మకూరు మండలం పార్నపల్లి గ్రామానికి చెందిన చాకలి శ్రీనివాసులు పట్టణానికి వచ్చి పనిముగించుకుని స్వగ్రామానికి వెళ్లేందుకు శ్రీనివాససెంటర్‌లో బస్సు కోసం వేచివుండగా.. పట్టణానికి చెందిన మహేష్ అనే వ్యక్తి కారులో ఆత్మకూరుకు వెళ్తుండగా లిఫ్ట్ అడిగాడు. కొత్తపల్లి సమీపంలో బస్సును ఓవర్‌టేక్ చేయబోయి కారు అదుపుతప్పింది. శ్రీనివాసులు కూర్చున్న వైపు బస్సు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఘటనా స్థలానికి చేరుకున్న ట్రాఫిక్ పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పోలింగ్ కేంద్రాల వద్ద ప్రథమ చికిత్స కేంద్రాలు



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్

కర్నూలు(హాస్పిటల్): ఈ నెల 13వ తేదీన ఓటింగ్ జరిగే 1096 పోలింగ్ కేంద్రాల వద్ద ప్రథమ చికిత్స కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ చెప్పారు. ఇందులో పారామెడికల్ ఉద్యోగులతో పాటు ఆశా కార్యకర్తలను నియమించినట్లు తెలిపారు. బుధవారం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులతో ఆయన తన చాంబర్ నుంచి జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫారం –12డీ సమర్పించిన వారు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వంద శాతం ఉపయోగించుకోవాలని కోరారు. ప్రథమ చికిత్స కేంద్రాల వద్ద ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు వైద్య సిబ్బంది మందులతో పాటు చికిత్స అందించాలన్నారు. చికిత్స అందించలేని వారిని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు పంపాలన్నారు. ఎన్నికల నేపథ్యంలో వైద్య ఆరోగ్యశాఖ సిబ్బందికి ఈ నెల 11 నుంచి 15వ తేదీ వరకు ఎలాంటి సెలవులు మంజూరు చేయరాదని అధికారులను ఆదేశించారు. సమావేశంలో పరిపాలనాధికారి అరుణ, ఎపడమిక్ సెల్‌సిబ్బంది చలపతి, మోక్ష పాల్గొన్నారు.

కొత్తపల్లెలో టీడీపీ గూండాయిజం



కొత్తపల్లెలో మోహరించిన పోలీసు బలగాలు

దొర్నిపాడు: మండలంలోని డబ్ల్యూ. కొత్తపల్లి గ్రామంలో టీడీపీ నేతలు రౌడీయిజం చేస్తూ దాడులకు పాల్పడ్డారు. ప్రశాంతంగా ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలపై మూకుమ్మడి దాడికి తెగబడ్డారు. బాధితులు తెలిపిన వివరాల మేరకు.. మాజీ మంత్రి భూమా అఖిలప్రియ సొంత గ్రామమైన కొత్తపల్లెలో వారి బంధువు భూమా వీరభద్రారెడ్డి మరి కొంత మంది కలిసి గ్రామంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గంగుల బిజేంద్రారెడ్డికి ఓట్లు వేయాలని అభ్యర్థిస్తూ ప్రచారం చేపట్టారు. ఇది జీర్ణించుకోలేని టీడీపీ నాయకులు భూమా సందీప్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి, కొంత మంది అనుచరులతో వారి దగ్గరకు వచ్చి 'మా గ్రామానికి వచ్చి వైఎస్సార్‌సీపీ అభ్యర్థికి ఓటు వేయాలని అడిగే దైర్యం ఎక్కడిదిరా..' అంటూ వీరభద్రారెడ్డిపై దాడి చేశారు. దీంతో పక్కనే ఉన్న భార్య రాజశేఖరి, కుమారుడు ప్రకాష్‌రెడ్డి అడ్డుకునేందుకు ప్రయత్నించగా ముగ్గురిని దుర్భాషలాడతూ దాడి చేశారు. దీంతో గ్రామంలో తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది. విషయం తెలిసిన వెంటనే సీఐ హనుమంత నాయక్ పోలీసులతో గ్రామానికి చేరుకున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

యువకుడిపై హత్యాయత్నం



బాబాఫక్రుద్దీన్‌పై దాడి చేస్తున్న యువకులు

బొమ్మలసత్రం: నంద్యాల పట్టణంలోని శ్రీనివాస నగర్ సెంటర్ వద్ద బుధవారం అందరూ చూస్తుండగానే ఓ యువకుడిని నలుగురు యువకులు బీరు సీసాలతో పొడిచి హత్యాయత్నానికి పాల్పడ్డారు. వన్‌టౌన్ సీఐ చలపతి తెలిపిన వివరాలు.. గుడిపాటిగడ్డ వీధికి చెందిన బాబాఫక్రుదీన్ మద్యం తాగేందుకు ప్రతాప్ థియేటర్ వద్ద ఉన్న ఓ బార్‌లోకి వెళ్లాడు. పక్కనే శ్యామ కాలువ సమీపంలో నివసించే చాకలి మధు, చాకలి మాధవ మరో ఇద్దరు కలిసి మద్యం తాగుతున్నారు. నలుగురు యువకులు బార్‌లో గట్టిగా కేకలు వేస్తుండటంతో పక్కనే ఉన్న బాబాఫక్రుద్దీన్ కేకలు వేయవద్దన్నాడు. తమకు అడ్డుచెప్పడానికి నీవెవడివంటూ నలుగురు యువకులు బాబాఫక్రుద్దీన్‌పై బీర్ సీసాలతో దాడి చేశారు. తప్పించుకునేందుకు బార్ బయటికి పరుగులు తీసినా వదలకుండా విచక్షణా రహితంగా పొడిచి గొంతుపై కాలితో తన్ని గాయపరిచి అక్కడి నుంచి వెళ్లిపోయారు. స్థానికుల నుంచి సమాచారం అందుకున్న పోలీసులు రక్తపుమడుగులో పడివున్న బాబాఫక్రుద్దీన్‌ను చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. యువకుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

చెక్ పోస్టులోకి దూసుకెళ్లిన కంటైనర్



ప్రమాదంలో దెబ్బతిన్న చెక్ పోస్టు

డోన్ టౌన్ : సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా పట్టణ సరిహద్దులో (జాతీయ రహదారి దత్తాత్రేయ స్వామి గుడి వద్ద) ఏర్పాటు చేసిన తనిఖీ కేంద్రంలోకి కంటైనర్ లారీ దూసుకెళ్లడంతో షెడ్డు ఒక్క సారిగా కుప్పకూలి పోయింది. బుధవారం సాయత్రం కర్నూలు నుంచి అనంతపురం వైపు వెళ్తున్న కార్లు తరలించే కంటైనర్ చెక్ పోస్టు సమీపంలో ఏర్పాటు చేసిన స్పీడ్ కంట్రోల్ బ్యారికేడ్లను దాటే సమయంలో అదుపు తప్పి చెక్ పోస్టు శిబిరంలోకి దూసుకెళ్లింది. ఆ సమయంలో విధులు నిర్వహిస్తున్న ఏఎస్ఐ శ్రీరాములు, కానిస్టేబుల్స్ శివ, బషీర్, మహ్మద్ షెడ్డులోనే ఉన్నారు. షెడ్డు (కేంద్రం)డ్యామేజ్ కావడంతో తేరుకొని బయటకు పరుగులు తీశారు. ఈ ప్రమాదంలో షెడ్డుతో పాటు అక్కడే ఉన్న విద్యుత్ స్తంభం, సీసీ కెమెరా, టేబుళ్లు దెబ్బతిన్నట్లు అధికారులు తెలిపారు. ప్రమాదానికి కారణమైన కంటైనర్‌ను అదుపులోకి తీసుకొని విచారణ చేస్తున్నారు. సంఘనా స్థలాన్ని రూరల్ సీఐ అస్రత్‌బాషా, ఎస్ఐ సుధాకర్‌రెడ్డి పరిశీలించారు.

శాశ్వత లోక్ అదాలత్‌లో కేసు పరిష్కారం

కర్నూలు (లీగల్): ప్రజా వినియోగ సేవలకు సంబంధించి ఏవైనా కేసులు ఉంటే శాశ్వత లోక్ అదాలత్‌ను సంప్రదించి ఒక్క రూపాయి కూడా ఖర్చు పెట్టకుండా సత్వరం పరిష్కరించుకోవచ్చని శాశ్వత లోక్ అదాలత్ అధ్యక్షుడు ఎం.వెంకటహరినాథ్ తెలిపారు. బుధవారం సత్వరం, సామరస్యపూర్వకంగా పరిష్కరించిన కేసు వివరాలను వెల్లడించారు. ఆయన మాట్లాడుతూ.. కర్నూలు జిల్లాకు చెందిన ముల్ల హమీదాబీ ఎస్.బుడాన్ సాహెబ్ వద్ద తీసుకున్న అప్పు తీర్చేందుకు 2022 నవంబర్ 29న రూ.25వేలకు చెక్కు ఇవ్వగా.. ఖాతాలో 'సరిపడ నిధులు' లేని కారణంగా ఎస్‌బీఐ నందికొట్కూరు బ్రాంచ్ వారు చెక్కు తిరిగి పంపడమే కాకుండా అకౌంట్‌ను విత్‌హోల్డ్‌లో పెట్టారని చెప్పారు. అయితే తన నెల పెన్షన్ మొత్తం కూడా అదే ఖాతాలో జమ అవుతుందని, లావాదేవీల కోసం ఖాతాను యాక్టివేట్ చేయమని హమిదాబీ కోరినా బ్యాంకువారు స్పందించలేదన్నారు. దీంతో ప్రతివాది ఎస్‌బీఐ నిర్లక్ష్య వైఖరిపై హమీదాబీ శాశ్వత లోక్ అదాలత్‌ను ఆశ్రయించారని తెలిపారు. ఈ విషయాన్ని తెలియజేస్తూ బుడాన్ సాహెబ్‌కు అదాలత్ ద్వారా నోటీసు జారీ చేసి.. ఇరువురికి ఆమోదయోగ్యమైన పరిష్కారాన్ని సూచించారని తెలిపారు. అలాగే బ్యాంకు ఖాతా నుంచి విత్‌హోల్డ్ ఆర్డర్‌ను తొలగించారని చెప్పారు. శాశ్వత లోక్ అదాలత్ సభ్యులు టి.శివశంకర్‌రెడ్డి, డి.రాజుబాబు, న్యాయవాది పి.శివసుదర్శన్ పాల్గొన్నారు.